లేచి పోవాలనుకొంటే

మునిమాణిక్యం నరసింహారావు

తలుపు నెట్టి విసురుగా, ఇంట్లోకి ప్రవేశించి అన్నాను, నేను వెడుతున్నాను. ఇక మనకు కుదరదు లే' అని.

"నేనేంజేశాను? మీకంత కోపం రావటానికి! ఏదో సంసారంలో, భార్యాభర్తలన్న తరువాత పోట్లాటలంటూ వస్తే సర్దుకు పోతారుగాని తెంచుకు పారిపోతారా?"

"......................"

"మాట్లాడరేం? ఎక్కడైనా ఉందండీ ఇల్లాంటి వైపరీత్యం? సంసారం గుట్టు, రోగం రట్టు అన్నారు. మీరు నన్నిలా అల్లరి పెట్టడం ధర్మం కాదు. అయినా ఇంతకూ నా తప్పేముంది?

"మళ్లీ యాకరు పెట్టుకుంటావా మొదటినుంచీ?"

"వద్దు, బాబూ వద్దు. మళ్ల మొదటికి తీసుకురాకండి.

"అయితే నీవు మాట్లాడక....సుశీ, అట్లా రోడ్డుమీద కెళ్లి ఒక బండి తీసికొనిరా?

"ఉండవే, అమ్మాయ్, అయితే ఎక్కడకీ ప్రయాణం ఒక్క మాట చెప్పండి?

"ఎక్కడికైతే నీకెందుకు? ఎక్కడికో వెళ్లిపోతాను."

"బండి తేనా, నాన్నా."

"ఇంకా, ఇక్కడే ఉన్నావుటే?"

"అయితే వెళ్లిపోవటం నిశ్చయము అన్నమాటే!

"నిశ్చయమా అని మెల్లగా అడుగుతున్నావేమిటి? వెళ్లిపోతుంటే, అన్నాను దుఃఖాన్ని దిగ మ్రింగుకొని.

"మళ్లీ ఎప్పుడు వస్తారు?"

"నీ కేం, వేళాకోళంగా ఉందా ఏమిటి? ఇదే ఆఖరుసారి ఈ ఇంట్లో................"

అనేసరికి అప్రయత్నంగా నా గొంతుకలోకి సన్నని వణుకు వచ్చింది: ఆ రోజున నేనన్న మాటలు హాస్యానికి కాదు. అట్లా ఒక నాటకం ఆడానని అనుకోలేదు.

నిజం. దైవ ముఖాన చెబుతున్నాను. నిజంగా సంసారం త్యజించి పోదామనే ప్రయత్నం. సౌఖ్యం లేకపోయిన తరువాత జీవించటంవల్ల ప్రయోజనం ఏముందని అల్లా అని ప్రాణత్యాగం చేసుకోలేము. ఏదో ఇదివరలో సంపాదించి, పెద్దలు ఇచ్చిపోయిన బాపతు

ఆస్తివలన జీవనం గడుస్తుంది మా సంసారానికి నేనున్నా, లేకపోయినా.

కాంతం సంగతా అయిపోయినవి సౌఖ్యదినాలు.

ఇకముందు నా జీవితానికి అంతా అమావాస్యేగాని వెన్నెల దినాలు రాబోవు.

పిల్లల సంగతో, భగవంతుడే ఉన్నాడు! ఎందుకు జీవిస్తున్నట్లు నేను! సంపాదించి మేడలూ మిద్దెలూ కట్టడం లేదు. సాహేబు సంపాదన బూబమ్మ కుట్టుపోగులకు సరి, అన్నట్లుంది నా సంపాదన. నే జేసేలోకోపకారమా, సున్నాకు సున్నా, హళ్లీకి హళ్లీ. ఇంకెందుకు ఈ గంపెడు సంసారాన్ని ఈదటం? నేను లేకపోయినా గడిచిపోతుంది. అంచేత



దుఃఖ జనకమై కేవలము మిథ్యయైన ఈ సంసారాన్ని వదిలేసి ఇతర దేశాలలో అజ్ఞాతంగా తిరుగుతూ భక్తిని అలవరించుకొని, ముక్తిని సాధిద్దామని ఆరోజు నిజంగా అనుకొన్నాను. నిజమంటే నిజం.

అయితే ఆవిడకు మాత్రం నా నిజోద్దేశం చెప్పినా నమ్మలేదు.

"నిజంగా వెడతారా."

"ఆ............."

"సరే! వెళ్లేవాళ్లను పట్టుకొంటె మటుకు ఆగుతారా? వక్కమాటు ఇలా చూడండి. పసిదికూడా వస్తుందట! ఎట్లా దూకుతుందో చూడండి! ఒక్కమాటు తీసికొండి!"

"ఒక్కసారి కాదు గదా. అరసార్లైనా తీసుకొను. తెంపుకు పోతున్నవాడిని ఈ ప్రేమబంధాలతో ఎందుకు కట్టిస్తావు? పొయ్యేవాణ్ని పోనీ, అడ్డురాకు.

"..............."

"నవ్వుతావూ! నీకేం తెలుస్తుంది నా కడుపులో పుట్టిన ఆందోళన, నాకు వద్దు ఈ సంసారం...నరకం...

సంఘం, శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
బుద్ధం శరణం గచ్ఛామి

"అబ్బ, ఎంత కఠినమండీ, సాక్షాత్తు బుద్ధదేవుళ్లై పోతున్నారే! బుద్ధదేవుడు కూడా మహాభినిష్క్రమణానికి ముందు భార్యా పుత్రులవంక ఒక్కసారి ప్రేమదృక్కులు ప్రసాదించాడు. తెలియదండీ!"

"అయితే సరే, ఒక్కసారి ఇయ్యి. ఒకసారే. ఒక గాఢాలింగనం..........ఒక్క చుంబనం............ సరి తీసుకో...నన్ను బంధించక.........బుద్ధం శరణం గచ్ఛామి......

"రావటం లేదు. మీ దగ్గరనుంచి."

"తీసుకో...ఇంద...ఊ."

"రానంటుంటే...దాన్నికూడా తీసికెళ్లండి. జాగ్రత్తగా పెంచండి. శిష్యురాలౌతుంది!"

"మరేం అక్కర్లేదు...ఇంద"

"నిజంగా వెడతారా?

"వెడుతుంటేనే...పిల్లలను జాగ్రత్తగా పోషించుకో అవున్నది చాలు, లేదనకుండా గడవటానికి, అని గిరుక్కున తిరిగాను. ఇటు మాడునుగదా పిల్లలంతా ఎక్కడికో ప్రయాణ సన్నాహంలో ఉన్నారు. కాంతంతో అన్నాను.

"వీళ్లను నామీదికి తోలే వేమిటి? వీళ్లను తీసుకుపో. నేను వెళ్లిపోతాను. ఈ చివర రోజునకూడా నీవు నాకు అనుకూలవతివి కావూ?" అన్నాను కంపిత కంఠంతో.

"వారు నామాట వినరు. మీరే చూచుకోండి ఆ విషయం." అంటూ కాంతం చరచర నడిచిపోయింది.

"ఒరేయి ఏమిటిది బూడ్సులు తొడుగుతున్నా వెందుకు?"

"నేనూ, వస్తానాన్నా."

"అదేమిటే అమ్మాయి?

"............"

"నువ్వెక్కడికే సుశీ?"

"............"

"నువ్వెందుకురా, అట్లా చిందు వేస్తావు.?"

"నేనూ, వస్తాను నాన్నా.

"నేనూ......"

"నేనూ...నాన్నా"

"నేనూ......"

"ఊ...ఊ...ఊ...ఊ..."

"ఓరి వెధవల్లారా. ఎక్కడికి వస్తారు. ఎక్కడికిరా వస్తారూ అంటా? అమ్మ ఉప్మా చేసింగి. పొండి?"

"ఊహు...ఊహు...ఊహు"

"ఎక్కడికి వస్తావురా?"

"నీవు ఎక్కడికి వెళుతున్నావు?"

"నేను వెళ్లిపోతున్నాను"

"ఊ...ఊ..."

"నేను...వస్తా...నాన్నా..."

"ఓరి వెధవా నేను సంసారం వదిలేస్తున్నా."

"నేను వదిలేస్తా నాన్నా..."

"ఓరి గాడిదా, సన్యాసం పుచ్చుకోటానికి వెడుతున్నానురా"...అన్నాను విసుగ్గా...

"నేనూ, పుచ్చుకొంటా నాన్నా" అన్నాడు మా అయిదేండ్ల చిన్న వెధవ.

"నేనూ నాన్నా అని దిక్కుముఖం వేసింది సుశీ"

ఈ చిన్న వేదనలంతా నాతోపాటు సన్యాసం పుచ్చుకుంటామంటూ బయలు దేరారు. బుద్ధదేవుడికి ఒక్క కొడుకు కాబట్టి తెంచుకు పారిపోయినాడు. అదీ నిద్ర పోతున్నప్పుడు! అదీ అర్ధరాత్రి! అసుర సంధ్యవేళ అరడజను పిల్లలను వదలించుకొని వెళ్ళవలసి వచ్చినట్లయితే తెలిసేది, ఈ సంసారానికి మానవుడు ఎట్లా కట్టుబడి ఉన్నాడో!

3

కుర్చీలో కూలబడ్డాను కదలకుండా మెదలకుండా: పిల్లలు నా ముఖం వంక చూశారు. నేను నవ్వకుండా, గంభీరంగా ఉండటం చూచి పెద్దపిల్లలు ఒక్కరొక్కరే జారారు.

చిన్నవాళ్లు ఏడుస్తూ, తల్లిదగ్గరకు పోయినారు. కళ్లు మూసికొన్నాను.

చెన్నుడు కోటవెలుపల గుర్రాన్ని తయారుచేసి ఉంచి సిద్ధంగా ఉన్నట్లూ, బుద్ధదేవుడు గంభీర వదనంతో, భార్యా పుత్రాదులను, ధన సంపదలనూ, సర్వమూ త్యజించి, ఆతురలో వస్తూ ఉన్నట్లు, నాకొక దృశ్యం కనపడ్డది. బుద్ధదేవుడ్ని ప్రార్థనచేసి, నేనూ, ఒక్కమారు, ఇంటిని నాల్గు దిక్కులా చూచి, నిట్టూర్పు విడిచి, గుమ్మం గాటి బైట పడ్డాను ఈ విశాలమైన ప్రపంచంలోకి.

౪

వీధి మలుపు తిరిగాను. బుద్ధదేవుడ్ని ధ్యానిస్తూ వెనకాలనుంచి కెవ్వున కేకేసి పరుగెత్తికొని వస్తున్నారు రాధా విజయలు. పెద్దవాడు లాగూ, చొక్కా, కోటూ వేసికొని, బూడ్సులు తొడుక్కొని, చెమ్కి టోపి పెట్టుకొని నాకు నాల్గు గజాల దూరంలో ముందు నడుస్తున్నాడు,—నేను రావటాన్ని గమనిస్తూ, మాటిమాటికి వెనక్కు తిరిగి చూస్తున్నా. పెద్దపిల్లలిద్దరూ కొత్త పరికిణీలు కట్టుకొని కొత్త చొక్కాలు తొడుక్కున్నారు. వాళ్లమ్మ నడిగి తీసుకొన్నారు కాబోలు బంగారు గొలుసులు మెడలో మెరుస్తున్నవి. దూరంగా రోడ్డుమీద నుంచుని నేను పోవలసిన దారినే ముందుగా గబగబ నడుస్తున్నారు. త్రిగత్నాలను నేను మరోసారి స్మరించుకొన్నాను.

వీళ్లం జూచి నేను తెల్లబోయినాను. అమ్మాయిలను పిల్చి "వెళ్లండే యింట్లోకి" అన్నాను. వాళ్లు "మేము వేరే పనిమీద వెడుతున్నాము ఇంకొకచోటికి. నీతో రావటం లేదు" అని కిలకిలా నవ్వుతూ దూరంగా నుంచున్నారు.

"నువ్వొక్కడివేరా పోరా" అన్నాను దగ్గరనున్న వెధవతో.

"నేను వస్తాను నాన్నా," అని మళ్లీ అన్నాడు వాడు బిక్కమొఖం వేసి.

"నేను ఎక్కడికి వెడుతున్నా ననుకొంటున్నావురా," అన్నాను.

"అమ్మ చెప్పిందిలే నాన్నా. అక్కయ్యలు రావటం లేదేం? అదుగో వాళ్లు నీకంటె ముందె అక్కడుంటారు.

"ఎక్కడుంటారురా?"

"అక్కడే!..."

"ఎక్కడరా! ఏమని చెప్పింది అమ్మ."

"............"

"నేను వస్తాను నాన్నా, మొన్న కూడా రాలేదూ"

"ఎక్కడికి వెడుతున్నా ననుకుంటున్నావు చెప్పవేం?"

"అమ్మ చెప్పిందిలే నాన్నా నీవు సినిమాకు వెడుతున్నావని"

"ఆ... ఆ..."

తెల్లబోయినాను. పిల్లలిద్దరూ కాళ్లకు చుట్టేసుకొని ఏడుస్తున్నారు. ఆ వీధిలోని ఆడవాళ్లు కిటికీలోనుంచి చూస్తున్నారు. అసహ్యమనిపించింది. పసిదాన్ని, చిన్నవాడ్ని, రెండు చేతుల్లో యెత్తుకొని మళ్లీ గుమ్మంలోకి

వచ్చేను. పెద్ద వెధవ ఇష్టంలేక ఇష్టంలేక మెల్లగా అడుగులో అడుగు వేస్తున్నాడు నా వెనకాల. నేను గుమ్మం దగ్గరకు వెళ్లి తలుపు కొట్టాను.

౫

"ఎవరది? చెయ్యి ఊరుకోలేదు వెళ్లండి."

"తలుపు, తలుపూ"

"............"

"తలుపూ, అయ్యో, తలుపు తియ్యవే!"

"ఎవరా, తలుపూ"

"నేనే..."

"అంటే..."

"అబ్బ... నేనే"

"ఎందుకూ?"

"తీయి, చెబుతా?"

"ఏమిటి చెప్పేది? సంసారంపైన విరక్తి పుట్టిపోయినవాళ్లకు అప్పుడే ఇదేం వికారం?"

"కాదులే, చెబుతా, తలుపుతీయి"

"కాదేమిటి? చెప్పేదేమిటి! మళ్లా ఎందు కొచ్చావు? ఈ కూపంలోకి; వెళ్లండి, వెళ్లండి."

"ఒక్క మాట."

"మాటా లేదూ, గీటా లేదూ, వెళ్లండి."

"మాటు, మాటంటుంటే."

ఇంకేం, మాటలు లెద్దురూ?"

"అబ్బ చాల్లే! తలుపుతీయి, చేతులు పీకుతున్నాయి." అన్నాను.

మా అబ్బాయి "వద్దు నాన్నా, వెడదాం రా నాన్నా, అమ్మ తీయకపోతే ఏం? భయమా?" అన్నాడు.

"ఇంకేం, వెళ్లండి, కొడుకు చెబుతున్నాడుగా సలహా" అంటూ తలుపుతీసింది కాంతం.

"ఎందుకూ, మళ్లీవచ్చారు?" అన్నది అణచిపెట్టుకొన్న నవ్వుముఖం అంతా కలయబారింది.

"మరి వీళ్లంతా?"

"నన్నేమి చేయమంటారు?"

"నువ్వు చేసిందే కాదూ, ఇదంతా?"

ఈ మాత్రం జయించలేని వాళ్లేనా, ప్రపంచాన్ని జయించటానికై బయలుదేరారు?" అన్నది ఈసడింపుతో పసిదాన్ని అందుకొంటూ.

"నిజమేలే! ఇకలే అడ్డం...అన్నాను విసుగ్గా."

"ఊహు..."

"అదేమిటి అల్లాగ నుంచుని లేవవు...పేరు జెప్పిస్తావా ఏమిటి?"

"అటువంటిదేని..."

"ఏమిటది?"

"ఒప్పుకోండి, ఓడిపోయినానని."

"సరే, ఓడిపోయినాను. ఇకలే! వీధిలో ఆడవాళ్లందరూ కిటికీలలోనుంచి చూస్తున్నారు."

"లేకాదు. హ్యాండ్స్ అప్, (Hands up) నెపోలియన్ ఒడిపోయి ఆంగ్లేయుల ఎర్ర పతాకానికి సలాం చేసి చేతులెత్తలా! అట్లా!

"చిత్తం", అని సలాంచేశాను. గాలికి కాంతం పమిట విప్పారి టపటప కొట్టుకొన్నది.

....

"ఏమిటది?"

"ఏం, లేదు, పక్షులు గూండ్లను చేరుతూ కిచకిచ లాడుతున్నాయి"

"కాదు, కాంతం, ఎవరో నవ్వుతున్నారు."

"కాదు రండి."

దభీలుమని తలుపు వేసింది కాంతం.—

ఒక సుప్రసిద్ధమైన కంపెనీ మీ కందుబాటులో వుంది



ఈ సులోచనాల షాపు, అనుభవజ్ఞులైన వారితో, మీకు తగినవానిని సమకూర్చడాని కన్నివిధాలా తగివున్నది.

మితమైన చౌక ధరలకు ఆకర్షవంతమైన, అందమైన ఫ్రేములున్నాయి.

చలువ అద్దాలు అన్ని రకాలవి దొరకును.

కాల పరిమితి తప్పకుండుట, సరియైన వర్తన, ఆదరణ యెల్లప్పుడును ఇందు కూడియుండును.

కె. రత్నా అండ్ కంపెని,

మ్యానుఫ్యాక్చరింగు ఆప్టిషియన్స్, 305, ఎస్ప్లనేడ్, మద్రాసు.

మీకు కావలసిన చక్కని స్వదేశీ సిల్కు యుడుపులు, గుడ్డలు, పలువిధములైన చీరెలు, జాకెట్టు రకములును,

కేశవరామ్ అండు కంపెని,

1/287 ఎస్ప్లనేడ్ రోడ్డు, మద్రాసులో దొరకును.